సాక్షి చిత్తూరు

శనివారం ; 7 ; అక్టోబర్ ; 2023



పార్వతీ తనయుడికి పూలంగి సేవ

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామికి శుక్రవారం రాత్రి ఘనంగా పూలంగి సేవ నిర్వహించారు. - 8లో



'సుమ'నోహరంగా బోయకొండ

బోయకొండ గంగమ్మ ఆలయాన్ని శుక్రవారం వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	24
తిరుపతి	34	24
తిరుమల	31	21
గూడూరు	37	27
నగరి	36	25

న్యూస్‌రీల్

బదిలీలపై ఎన్నికల కమిషన్ నిషేధం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా ప్రక్రియలో పాల్గొంటున్న అధికారుల బదిలీలపై నిషేధం విధించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల జాబితా తయారీలో ఆర్‌ఓ (కలెక్టర్), ఈఆర్‌ఓ (జాయింట్ కలెక్టర్, సబ్‌కలెక్టర్, ఆర్‌డీఓ, డిప్యూటీ కలెక్టర్, నగరపాలక కమిషనర్), ఏఈఆర్‌ఓ లుగా వ్యవహరించే (తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్), వీఆర్‌ఓ, వీఆర్‌ఏ, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఇతర స్థాయి అధికారులను 2024 జనవరి 5 వ తేదీ వరకు బదిలీ చేసేందుకు వీల్లేదని పేర్కొన్నారు. ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెల 10వ తేదీలోపు వివరాలు పంపించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

కళాకారుల గుర్తింపు కార్డులకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : రంగస్థల కళాకారులు ఈ నెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి పద్మజ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ కొత్త గుర్తింపు కార్డు పొందేందుకు కళాకారుడి పేరు, జెండర్, బ్లడ్ గ్రూపు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, చిరునామా, జిల్లా, కళారూపం, అనుభవం, సెల్ , ఆధార్ నంబర్లు, ఈ మెయిల్ అడ్రెస్ వివరాలను దరఖాస్తులో పేర్కొనాలని సూచించారు. ఆ మేరకు ధ్రువీకరణ పత్రాలను సైతం జత పరచాలని కోరారు. అనంతరం తహసీల్దార్ అటెస్టేషన్‌తో కలెక్టరేట్‌లోని సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

నేటి వరకు సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు

చిత్తూరు కలెక్టరేట్ : సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలుంటే శనివారంలోపు తెలియజేయాలని ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. జోన్-4 పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న టీజీటీలకు పీజీటీలుగా ఉద్యోగోన్నతులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ప్రాథమిక సీనియారిటీ జాబితాను డీఈఓ కార్యాలయానికి పంపించామన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని మోడల్ స్కూళ్ల టీజీటీలు జాబితాలను పరిశీలించుకుని, అభ్యంతరాలుంటే లిఖిత పూర్వకంగా డీఈఓ మెయిల్ ద్వారా ఆర్జేడీ కార్యాలయానికి పంపించాలని సూచించారు. అభ్యంతరాలను పరిశీలించి 11వ తేదీన తుది సీనియారిటీ జాబితాను రూపొందిస్తామని వివరించారు. 12న సర్వీస్ రిజిస్టర్, సర్టిఫికెట్ల పరిశీలన, 13 పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు డీఈఓ వెబ్‌సైట్ చూడాలని కోరారు.

వరసిద్ధుని హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి హుండీని శుక్రవారం లెక్కించినట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. 22 రోజులకుగాను మొత్తం రూ.1.71 కోట్ల ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, రవీంద్రబాబు, హేమమాలిని, హరిమాధవ రెడ్డి, పర్యవేక్షకులు రవి, రంగస్వామి, కోదండపాణి, శ్రీధర్‌బాబు, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

తిరుపతి సిటీ: ఏపీ పీజీసెట్-2023లో ర్యాంకు సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శనివారం నుంచి జరుగుతుందని ఎస్వీయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ మురళి తెలిపారు. ఎస్వీయూలో పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందనున్న విద్యార్థులకు శనివారం నుంచి ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలనతో పాటు ఫీజు చెల్లింపు ప్రక్రియ జరుగుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్వీయూ స్టేట్ బ్యాంకు భవనంలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్లతో రిపోర్టు చేయాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలోని క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టోకెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

సురక్ష.. శ్రీరామరక్ష

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం విప్లవాత్మకమైన పథకాలను ప్రారంభించింది. వైద్యరంగం అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ అమలు చేస్తోంది. అందులో భాగంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు శ్రీకారం చుట్టింది. ప్రతి ఒక్కరి ఇంటికే వెళ్లి వైద్య పరీక్షలు చేయించి.. వ్యాధిగ్రస్తులను గుర్తించింది. ఆయా సచివాలయాల పరిధిలో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తోంది. నిపుణులైన డాక్టర్లతో రోగులకు చికిత్సలందించడమే కాకుండా ఉచితంగా మందులు పంపిణీ చేస్తోంది. ఈ క్రమంలోనే సురక్ష శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. సర్కారు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజానీకం భారీ సంఖ్యలో తరలివస్తోంది.

పుత్తూరు : వైద్యశిబిరంలో మంత్రి రోజాకు బీపీ చెక్ చేస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీహరి



యాదమరి: వైద్య సేవలను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు



- ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు
- కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు
- అందుబాటులో హెల్త్ క్యాంపులు
- స్పెషలిస్ట్ డాక్టర్లతో చికిత్సలు
- వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు

చిత్తూరు రూరల్ : జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు.. శుక్రవారం పలుచోట్ల నిర్వహించిన హెల్త్ క్యాంపునకు జనం క్యూ కట్టారు. స్పెషలిస్టు వైద్యులు చికిత్సలందిస్తుండడంపై రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉచితంగా ఖరీదైన రక్త పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు సైతం అందిస్తుండడంపై సర్వత్రా ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. సీజనల్ వ్యాధుల ప్రబలే సమయంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం మంచి విషయమని అభినందిస్తున్నారు.

ఉచితంగా పరీక్షలు

ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణ కోసం ప్రైవేట్ ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించుకోవాలంటే కనీసం రూ.250 నుంచి రూ.800 వరకు ఖర్చవుతుంది. హెచ్‌బీఎస్ ఏజీ పరీక్ష చేయాలంటే సుమారు రూ.400 చెల్లించాల్సి ఉంటుంది. వీటితో పాటు ఆర్పీఎస్, హెచ్‌బీఏ 1సీ, యూరిన్, షుగర్, బీపీ తదితర పరీక్షలు చేయాలంటే ఖర్చుతో కూడుకున్న పని. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో అక్కడే స్పెషలిస్టు వైద్యులను సంప్రదించి ల్యాబ్‌లో వివిధ రక్త పరీక్షలను చేయించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. మందులు సైతం ఉచితంగా అందిస్తుండడం రోగులకు సులభతరంగా మారింది.

పకడ్బందీగా సురక్ష క్యాంపు

యాదమరి: మండలంలోని కొనాపల్లె సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని జేసీ శ్రీనివాసులు సందర్శించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. మెడికల్ క్యాంపుల నిర్వహించనున్న గ్రామాలకు ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు. వలంటీర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి టోకెన్లు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఆయన వెంట డీఎల్‌డీఓ రవికుమార్, డాక్టర్ రేఖ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమాచారం

శుక్రవారం నిర్వహించిన హెల్త్ క్యాంపులు 27	మొత్తం ఓపీలు : 8,122
జనరల్ ఓపీ 3,080	ఓటీజీ, జీవైఎన్ 731
స్కిన్ 342	ఆప్తమాలజీ 1,530
డెంటల్ : 153	ఇతర సేవలు : 688
హాజరైన పీహెచ్‌సీ వైద్యులు 54	స్పెషలిస్ట్ డాక్టర్లు 62

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

పుత్తూరు రూరల్: రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.వేల కోట్లు వెచ్చిస్తున్నారని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. శుక్రవారం పుత్తూరు మండలం కృష్ణసముద్రంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంత్రి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే ఉన్నత ఆశయంతోనే జగనన్న వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని వెల్లడించారు. అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రారంభించారన్నారు. ఒక్కో వ్యక్తికి సుమారు రూ.2,500 విలువైన పరీక్షలను ఉచితంగా చేయిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గత నాలుగేళ్లలో రూ.8,845 కోట్లతో 1.40 కోట్ల కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు అందించినట్లు వెల్లడించారు. అలాగే వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద రూ.13 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. అనంతరం వృద్ధులకు కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. డీఎంహెచ్‌ఓ శ్రీహరి, తహసీల్దార్ జె.పరమేశ్వరస్వామి, ఎంపీడీఓ పి.ప్రసాద్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, సర్పంచ్ ఆర్.దయ, ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు గోవిందస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి కళ్లజోడు అందిస్తున్న మంత్రి రోజా

మంచిగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం చాలా మంచిగా ఉంది. పేదలకు ఇంటి ముంగిటకే వచ్చి పరీక్షలు చేస్తున్నారు. వైద్యులు రిపోర్టును చూసి తగిన మందులను ఉచితంగానే అందిస్తున్నారు. మా ఊళ్లో నిర్వహించిన మెడికల్ క్యాంపులో నాకు కళ్లజోడు సైతం ఇచ్చారు. ప్రభుత్వ పనితీరు అద్భుతంగా ఉంది. – రాణెమ్మ, యాదమరి

అంతా ఉచితమే



సీఎం జగనన్న ప్రజల ఆరోగ్య రక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మా గ్రామానికే వైద్యులు వస్తున్నారు. వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తున్నారు. అవసరమైన వారికి ఇతర ఆస్పత్రుల వైద్యులతో మాట్లాడి అక్కడ చేర్పించేందుకు రెఫర్ చేస్తున్నారు. ఇంతకన్నా పేద ప్రజలకు అండగా నిలిచేదెవరు. ఇది నిజంగా పేదల ప్రభుత్వం. – దేశమ్మ, ఎట్టేరి, జీడీనెల్లూరు మండలం

సంతోషంగా ఉంది



వృద్ధాప్య సమస్యల కారణంగా బయటకు వెళ్లి వైద్యం చేయించుకోవాలంటే కష్టంగా ఉండేది. ఇంతలో మా గ్రామానికే వైద్య సిబ్బంది వచ్చి ఆరోగ్య పరీక్షలు చేశారు. మందులు కూడా ఇచ్చారు. మధుమేహం, బీపీకి చికిత్స చేశారు. కళ్లు తనిఖీ చేశారు. కంటి అద్దాలు ఇచ్చారు. సంతోషంగా ఉంది. – దొరస్వామి, చిన్నపాప బైటపల్లె, పూతలపట్టు మండలం

మందులు అందించారు



కొంత కాలంగా తీవ్రమైన కాళ్ల నొప్పులతో బాధపడుతున్నా. సురక్ష వైద్య శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు తగిన మందులను ఉచితంగా అందించారు. – శ్రీరాములు, గుడిపాల మండలం



హాయ్ చిత్తూర్.. థ్యాంక్యూ !

చిత్తూరు అడ్డా.. వీరుల గడ్డ.. ఇక్కడకు రావడం ఇదే తొలిసారి అని సినీ నటుడు అక్కినేని నాగార్జున తెలిపారు. శుక్రవారం నగరంలోని పలమనేరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కల్యాణ్ జ్యువెలర్స్‌ను ఆయన ప్రారంభించారు. హాయ్ చిత్తూర్.. అంటూ అభిమానులను ఆప్యాయంగా పలకరించారు. బంగార్రాజు చిత్రంలోని 'వాసివాడి తస్సాదియ్యా' డైలాగ్ చెప్పి అలరించారు. అభిమానుల హర్షాతిరేకాలను చూస్తుంటే ఆనందంతో హృదయం ఉప్పొంగుతోందన్నారు. నాగార్జునను చూసేందుకు భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు. సెల్ఫీల కోసం ఎగబడ్డారు.

- చిత్తూరు రూరల్

డ్రాగన్ ఇంజినీర్!

నెలకు రూ.లక్షల వేతనం..మల్టీనేషనల్ కంపెనీలో గౌరవ ప్రదమైన ఉద్యోగం.. యూకేలో 20 ఏళ్ల ఆడంబరమైన జీవితం.. ఇదంతా వదిలేసి కన్నతల్లి సంరక్షణకు స్వగ్రామం వచ్చాడు. ఐటీ కొలువుల వైపు అడుగులు వేయకుండా..ఎవరి దగ్గరా పని చేయాల్సిన అవసరం లేకుండా రైతుగా అవతారమెత్తాడు. తన పొలంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ లాభాల పంట పండిస్తున్నాడు.. చిత్తూరుకు చెందిన తులసీ రమేష్. ఆయన విజయగాథ తెలుసుకుందాం..

- కొత్తరకం పంటపై ఆసక్తి చూపిన ఇంజినీర్
- విదేశంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదలి సొంత ఊరిలో సాగు
- తక్కువ పెట్టుబడితో రూ.లక్షల ఆదాయం
- పంట రక్షణకు సీసీ కెమెరాల నిఘా

సాక్షి, తిరుపతి డెస్క్:

చిత్తూరు మిట్టూరుకు చెందిన తులసీరమేష్ ఇంజినీరింగ్ చదివారు. యూకేలో 20 ఏళ్లపాటు ఇంజినీర్‌గా ఉద్యోగం చేశారు. లక్షల రూపాయల జీతం వచ్చేది. తల్లి బాగోగులు చూసుకునేందు కోసం ఐదేళ్ల కిందట సొంతూరికి తిరిగొచ్చేశారు. మళ్లీ ఉద్యోగం కోసం ఎదురు చూడలేదు. ఎవరి వద్దా పనిచేయకూడదని, వ్యవసాయం చేయాలని నిశ్చయించుకున్నాడు. మండలంలోని ఏనుగుండ్లపల్లె సమీపంలో ఆయనకు ఆరు ఎకరాల భూమి ఉంది. ఇందులో వర్షాధార పంటలైన వేరుశనగ, అంతరపంటగా కందులు, జనుము వేసేవారు. సాగులో నష్టాలు చవిచూడడంతో కొత్త రకం పంటలపై దృష్టి పెట్టారు. ఆరోగ్యదాయినిగా పేరుగాంచిన డ్రాగన్ ఫ్రూట్ ప్రయోగాత్మకంగా సాగుచేయాలని నిర్ణయించారు. ఔషధ గుణాలు మెండుగా ఉన్న విదేశీ పండు కావడం, మంచి గిరాకీ ఉండడంతో సాగు విధానం, పెట్టుబడి ఖర్చు, వచ్చే ఆదాయం గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. తద్వారా అధిక లాభాలు పొందవచ్చని భావించి డ్రాగన్ ఫ్రూట్ సాగుకు పూనుకున్నారు. మంచి దిగుబడి పొందుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

అన్ని నేలలూ అనుకూలమే

నీరు నిలిచే బంక నేలలు మినహా డ్రాగన్ ఫ్రూట్ సాగుకు అన్ని భూములు అనుకూలమే. మెట్టప్రాంత భూముల్లో మొక్క బాగా పెరగడంతో పాటు పండ్ల సైజు, దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో వస్తుంది. నీటి ఎద్దడిని సైతం సమర్థవంతంగా తట్టుకుంటూ అధిక దిగుబడులను ఇస్తుందని తులసీ రమేష్ చెబుతున్నారు.

సాగు ఇలా..

డ్రాగన్ ఫ్రూట్ సాగుకు మొదటి ఏడాది మాత్రమే పెట్టుబడి వ్యయం ఎక్కువ. రెండో ఏడాది నుంచి తగ్గుతూ వస్తుంది. మొక్కలను మదనపల్లె ములకల చెరువు నుంచి తులసీ రమేష్ తీసుకొచ్చారు. మొక్కలు విక్రయించిన రైతు సలహా మేరకు నాట్లు వేశారు. ఈ పంటకు నీళ్ల అవసరం కూడా చాలా తక్కువ. తీగలాగా ఎదుగే. ఈ పంటను ఆరు ఎకరాల్లో సాగు చేసేందుకు తులసీరమేష్‌కి 2,350 సిమెంట్ స్తంభాలు అవసరమయ్యాయి. వాటి పొడవు 8 అడుగులు ఉండేలా చూశారు. స్తంభానికి నాలుగు చొప్పున మొత్తం 12,500 మొక్కలు నాటారు. స్తంభాల మధ్య 9 అడుగుల దూరం ఖాళీ వదిలారు. సిమెంట్ స్తంభానికి రూ.300, పైన టైరు, సిమెంట్ రింగ్‌కు రూ.250, మొక్క కొనుగోలుకు రూ.60 చొప్పున ఖర్చు చేశారు. ఎకరాకు సుమారు రూ.8లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. మొక్క నాటిన 10 నెలల తర్వాత పంట దిగుబడి వచ్చింది. ఎకరాకు 4 నుంచి 5 టన్నుల దిగుబడి రాగా, రూ.లక్ష వరకు ఆదాయం వచ్చింది. ఏటా ఈ ఆదాయం పెరుగుతోందని, జూలై నుంచి 5 నెలల వరకు పంట దిగుబడి వస్తుందని తులసీరమేష్ తెలిపారు.



ఏనుగుండ్లపల్లెలో తులసి రమేష్ పొలంలో డ్రాగన్ ఫ్రూట్



దిగుబడి అయిన డ్రాగన్

మార్కెట్‌లో మంచి గిరాకీ

తెలుపు, పింక్ కలర్‌లో డ్రాగన్ ఫ్రూట్స్ ఉంటాయి. తులసీ రమేష్ పింక్ రకాన్ని ఎంచుకుని సాగుచేస్తున్నారు. ఈపింక్ పండు రుచిగా ఉంటుంది. సీజన్‌లో ఒక్కో చెట్టుకు దాదాపు 70 నుంచి 80 పండ్లు కాస్తాయి. మార్కెట్లో కిలో పండు రూ.150 నుంచి రూ.300 వరకు అమ్ముడుపోతోంది. ఈ లెక్కన 2 వేల చెట్లకు రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది.


పుష్కలంగా ఔషధ గుణాలు

డ్రాగన్ ఫ్రూట్‌లో ఔషధ గుణాలు పుష్కలంగా ఉంటాయి. పోషక విలువలు, విటమిన్-సీ,బీ3, ఐరన్, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు, కార్బోహైడ్రేట్లు ఉంటాయి. పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

ఆరోగ్యకర దిగుబడి

డ్రాగన్ ఫ్రూట్ సాగుకు సేంద్రియ ఎరువుల వాడకం వల్ల ఆరోగ్యకర దిగుబడులు వస్తున్నాయి. ఆవు పేడలో వర్మీ కంపోస్ట్‌ను మిశ్రమం చేసి పంటకు వేస్తారు. ఏదైనా చీడ పురుగు సోకితే వేప నూనె, గోమూత్రం పిచికారీ చేస్తారు. ఫలితంగా మంచి దిగుబడితో పాటు నాణ్యత బాగుటుందని తులసి రమేష్ వెల్లడిస్తున్నారు. డ్రిప్ ద్వారా నాలుగు రోజులకు ఒకసారి పంటకు నీటిని అందిస్తారు. కీటకాలు, పక్షులు, జంతువుల బెడద ఉండదు. ఇవేవి ఆ పంట దరి చేరవు. దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు బిగించినట్లు ఆయన తెలిపారు.

చాలా ఆనందంగా ఉంది



డ్రాగన్ ఫ్రూట్ సాగు లాభాలు ఇవ్వడం ఎంతో సంతోషానిస్తోంది. యూకేలో రూ.లక్షల జీతం అందుకున్నా ఇంత సంతృప్తి ఎప్పుడూ లేదు. సేంద్రియ సాగు చేస్తున్నా కాబట్టి పెట్టుబడి ఖర్చు పెద్దగా లేదు. పండు నాణ్యత కూడా బాగుంది. ఈ సీజన్‌లో నెలలోనే రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చింది.

-తులసీ రమేష్, చిత్తూరు

పకడ్బందీగా 'గతిశక్తి' ప్రతిపాదనలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గతిశక్తి పథకంలో భాగంగా నిర్మించనున్న రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలకు పకడ్బందీగా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. గతిశక్తి పథకం కింద జిల్లాలో 21 ప్రాంతాల్లో రైల్వే లెవల్ క్రాసింగ్‌లను తొలగించి వాటి స్థానంలో ఆర్‌ఓబీ, ఆర్‌యూబీలను నిర్మించనున్నట్లు వెల్లడించారు. అలాగే పూతలపట్టు, చిత్తూరు, చిత్తూరు రూరల్, గుడిపాల, పులిచెర్ల మండలాల్లో రైల్వే గేట్‌లకు సైతం ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. సమావేశంలో గుంతకల్ డివిజన్ రైల్వే శాఖ డిప్యూటీ ఇంజినీర్ రమేష్‌బాబు, చిత్తూరు నగరపాలక కమిషనర్ అరుణ, ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ ఉమామహేశ్వరరెడ్డి, పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి , జాతీయ రహదారుల శాఖ ఈఈ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు పక్కా ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. ఆయా సచివాలయాల పరిధిలో క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకునే ప్రక్రియ చేపట్టాలన్నారు. చెప్పారు. అనంతరం జిల్లాకు చేరిన క్రీడా సామాగ్రిని పరిశీలించారు. వెంటనే సచివాలయాలకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ, కోచ్ ప్రతాప్ పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతో విపత్తులకు అడ్డుకట్ట



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ ధర్మారెడ్డి

తిరుమల: టీటీడీలో విపత్తుల నివారణకు ముందస్తు చర్యలతో అడ్డుకట్ట వేయాలని ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుమల అన్నమయ్య భవనంలో విపత్తుల నివారణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ విపత్తుల నివారణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.నాగరాజు, యూనిసెఫ్ కన్సల్టెంట్ అమల్ కృష్ణ రూపొందించిన డాక్యుమెంట్‌ను పరిశీలించారు. అనంతరం వారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈఓ మాట్లాడుతూ యాత్రికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, అగ్ని ప్రమాదాలు, వరదలు, ఇతర విపత్తులను ఎదుర్కొనేందుకు నిపుణుల సహకారం తీసుకోవాలని సూచించారు. నాగరాజు, అమల్ కృష్ణ మాట్లాడుతూ టీటీడీలోని పలు విభాగాల్లో విపత్తుల నివారణ ఎలాంటి చర్యలు తీసుకోవాలో డాక్యుమెంట్‌లో వివరించినట్లు తెలిపారు. జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం , సీవీఎస్వో నరసింహ కిషోర్, సీఈ నాగేశ్వరరావు, ఎస్‌ఈ-2 జగదీశ్వర్‌రెడ్డి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అల్పాహారం, పండ్లు పంపిణీ



పిల్లలకు పంపిణీ చేయడానికి సిద్ధం చేసిన పండ్లు, స్వీట్లు, అల్పాహారం

తిరుపతి కల్చరల్: టౌన్ బ్యాంక్ డైరెక్టర్ అనిల్ రాయల్ జన్మదినం సందర్భంగా శుక్రవారం అభయక్షేత్రంలోని పిల్లలకు అల్పాహారం, స్వీట్లు, బిస్కెట్లు, బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభయక్షేత్రం పిల్లల మధ్య అనిల్ రాయల్ కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హరి, సాయి, సూరి, చైతు, స్నేహితులు పాల్గొన్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని నన్నూరు వారిపల్లె పంచాయతీ గొల్లపల్లె వద్ద మామిడి తోటలో శుక్రవారం నిర్వహిస్తున్న కోడి పందేలపై దాడి చేసి నలుగురు పందెంరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.1,660, నాలుగు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు

పార్వతీ తనయుడికి పూలంగి సేవ



దేవదేవేరులను ఊరేగింపుగా తీసకువస్తున్న ఆలయ అధికారులు, ఉభయకర్తలు



హారతి సమర్పిస్తున్న అర్చకుడు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారికి శుక్రవారం రాత్రి భక్తిప్రపత్తులతో పూలంగి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే గణనాథునికి విశేష అభిషేకం జరిపించారు. సుగంధ పుష్పాలు గరిక మాలను అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి అలంకారం మండపంలో సిద్ధి, బుద్ధి సమేతంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం కనులపండువగా పూలంగి సేవ నిర్వహించారు. పంచ హారతులు సమర్పించారు. శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ జరిపించారు. అనంతరం ప్రాకారోత్సవం చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై దేవదేవేరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు. ఉత్సవాలకు వేలూరుకు చెందిన రాజమాణిక్యం నాయుడు కుమారులు, కాణిపాకానికి చెందిన రాధాకృష్ణన్ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేడు పుష్పపల్లకి సేవ

వినాయక స్వామివారికి శనివారం రాత్రి పుష్పపల్లకి సేవ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఉభయకర్తలు, అధికారుల పర్యవేక్షణలో సర్వం సిద్ధం చేస్తున్నారు.



పుష్పాలంకరణ చేస్తున్న దృశ్యం



పూలంగి సేవకు హాజరైన భక్తులు

'సుమ'నోహరంగా బోయకొండ

విశేష పుష్పాలంకరణలో బోయకొండ గంగమ్మ ఆలయం నూతన శోభ సంతరించుకుంది. శుక్రవారం బెంగళూరు దేవనహళ్లి లక్ష్మీఫ్లవర్ డెకరేషన్స్ నిర్వాహకులు చంద్రశేఖర్, సతీష్, గోపాలప్ప ఆధ్వర్యంలో ఆలయాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. సుమారు రూ:4 లక్షల విలువపై సుగంధ సుమాలతో అలంకరించారు. దాదాపు 15 ఏళ్లుగా దసరా ఉత్సవాలకు వారం ముందుగా ఆలయాన్ని ముస్తాబు చేయడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. డెకరేటర్స్‌ను ఈఓ చంద్రమౌళి ఘనంగా సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. - చౌడేపల్లె



విశేషాలంకరణలో గంగమ్మ తల్లి



ఆలయం.. పుష్పశోభితం

పలమనేరు విద్యార్థినికి ప్రధాని ప్రశంస

పలమనేరు : పట్టణానికి చెందిన శ్రీవాణి కళాశాల విద్యార్థిని అనూహ్యను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసించారు. జీ–20 యూనివర్సిటీ కనెక్టివిటీ ప్రోగ్రామ్ కింద నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఆమె సౌత్ ఇండియా నుంచి తొలి స్థానం దక్కించుకుని ప్రధానమంత్రి నుంచి పురస్కారం అందుకుంది. ప్రతిభ కనబరచిన విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తిరెడ్డి అభినందించారు.



అనూహ్య



నమ్మకమే కల్యాణ్ జ్యువెలర్స్ ఊపిరి

చిత్తూరు రూరల్: నమ్మకమే ఊపిరిగా కల్యాణ్ జ్యువెలర్స్ నడుస్తోందని, వారితో తనకు కొన్నేళ్ల అనుబంధం ఉందని సినీ నటుడు అక్కినేని నాగార్జున తెలిపారు. శుక్రవారం నగరంలోని పలమనేరు రోడ్డులో కల్యాణ్ జ్యువెలర్స్ షోరూమ్‌ను సంస్థ బ్రాండ్ అంబాసిడర్ నాగార్జున ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇది రాష్ట్రంలోనే 9వ షోరూమ్ అని, ప్రారంభోత్సవ వేడుకలో భాగస్వామి అయినందుకు ఆనందంగా ఉందన్నారు. ఆభరణాల పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన బ్రాండ్‌తో సుదీర్ఘ బంధం ఉండడం సంతోషంగా ఉందని చెప్పారు. ‘ట్రస్ట్ ఈజ్ ఎవ్రీథింగ్’ అనే సూత్రంపై చూపుతున్న అచంచలమైన అంకితభావమే పరిశ్రమలో వారిని విభిన్నంగా నిలుపుతోందని వెల్లడించారు. నమ్మకం, పారదర్శకత , కస్టమర్ సంతృప్తికి ప్రతీకగా ఈ బ్రాండ్ నిలుస్తోందని వివరించారు. ఈ ప్రాంతంలోని అభిమానులు కల్యాణ్ జ్యువెలర్స్‌పై తమ ప్రేమను చూపుతారని విశ్వసిస్తున్నానన్నారు. కల్యాణ్ జ్యువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కల్యాణరామన్ మాట్లాడుతూ ఒక కంపెనీగా, భారీ మైలురాళ్లను అధిగమించామని తెలిపారు. కస్టమర్ షాపింగ్ అనుభవాన్ని మెరుగుపరచడంతో పురోగతిని సాధించామని వెల్లడించారు. షోరూమ్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని రూ.లక్ష ఆభరణాలు కొనుగోలు చేసే కస్టమర్లకు సగం కొనుగోలు విలువపై జీరోశాతం మేకింగ్ చార్జీలను ఆఫర్ కింద అందిస్తున్నట్లు వివరించారు.



షోరూమ్ ప్రారంభిస్తున్న అక్కినేని నాగార్జున

చిరుత సంచారంపై కలకలం

శాంతిపురం: మండలంలోని పలు ప్రాంతాల్లో చిరుత సంచారంపై స్థానికంగా కలకలం రేపింది. గురువారం రాత్రి చెంగుబళ్ల పంచాయతీ శివకురుబూరు వద్ద చిరుతను స్థానికులు గుర్తించారు. సర్పంచ్ పూలకుంట భాస్కర్ వెంటనే పోలీస్, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన అధికారులు గ్రామానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం చిల్లమానుపల్లి సమీపంలో గొర్రెల మందపై చిరుత దాడి చేసి ఒక గొర్రెను లాక్కుపోయిందని గ్రామస్తులు తెలిపారు. రాత్రివేళల్లో పొలాల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఒంటరిగా ఉండవద్దని సూచించారు.

అన్నాచెల్లెలు దారుణ హత్య

తిరుపతి క్రైమ్: నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో అన్నా చెల్లెలు దారుణంగా హత్యకు గురైన ఘటన శుక్రవా రం చోటు చేసుకుంది. అలిపిరి సీఐ అబ్బన్న కథనం మేరకు.. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన యువరా జ్, మనీషా దంపతులకు షక్షీమ్(6), ప్రజ్ఞాన్(4) ఇ ద్దరు పిల్లలు ఉన్నారు. ఇతను మేస్త్రీ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఏడాది నుంచి భార్యాభర్తల మధ్య గొడవ చోటుచేసుకోవడంతో దూరంగా ఉండేవారు. అయితే యువరాజ్ 4 రోజుల కిందట తిరుపతి కి చేరుకుని నగరంలోని ఓ ప్రైవేట్ అతిథి గృహంలో బ స చేశాడు. ఇదే క్రమంలో భార్యకు ఫోన్ చేసి, తిరుపతి కొస్తే మాట్లాడుకుందామని చెప్పాడు. దీంతో మనీషా పిల్లలను తీసుకుని హైదరాబాద్ వరకు రైలులో వచ్చి, అక్కడి నుంచి తన అన్న హర్షవర్ధన్‌తోపాటు విమానంలో తిరుపతికి చేరుకుంది. ఆ రాత్రి ఏం జరిగిందో ఏ మో కానీ వీరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్ర మంలో యువరాజ్ తన భార్య మనీషాతోపాటు ఆమె అన్న హర్షవర్ధన్(25) కూడా దారుణంగా కత్తితో పొడిచి, హత్య చేశాడు. అయితే హత్యకు కారణాలు పలు కోణాల్లో వినిపిస్తున్నాయి. వీరి మధ్య ఆస్తి తగాదాలు న్నాయని, యువరాజును హత్య చేస్తే పెద్ద మొత్తంలో ఆస్తి వస్తుందని, అతడిని చంపడానికి వారు తిరుగు తున్నట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు. ఈ క్ర మంలోనే యువరాజ్ చంపి ఉండొచ్చని భావిస్తున్నా మన్నారు. యువరాజ్ అన్నతో మనీషాకు వివాహేతర సంబంధం ఉండడంతో వారి మధ్య గొడవ జరిగినట్లు కూడా తెలిసిందని సీఐ చెప్పారు. అయితే నిజాలు పూ ర్తి స్థాయిలో తెలియాల్సి ఉందన్నారు. మృతుల కు టుంబాలకు సమాచారం ఇచ్చామని, వారు వస్తే నిజా లు బయటపడతాయన్నారు. ఈ మేరకు కేసు నమో దు చేసి, మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించా మన్నారు. చిన్నారులను పోలీసులే సంరక్షిస్తున్నారు.

యువకుడి కిడ్నాప్

చిత్తూరు అర్బన్ : నగరంలో శుక్రవారం ఓ యువకుడు కిడ్నాప్‌కు గురయ్యాడు. వివరాలు.. కొంగారెడ్డిపల్లెకు చెందిన శివ అనే వ్యక్తికి పలు ప్రాంతాల్లో బార్బర్ షాపులు ఉన్నాయి. వీటిలో పనిచేసేందుకు నార్త్ ఇండియా నుంచి కొందరు యువకులను తీసుకువచ్చాడు. వారికి అడ్వాన్సు సైతం చెల్లించాడు. అయితే అందులో ఓ యువకుడు మరో దుకాణంలో పనిచేసేందుకు వెళ్లాడు. దీంతో శివ ఆగ్రహించి ఆ యువకుడిని బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లిపోయాడు. దీనిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







